సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9652278546

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కూటమి మోసంపై నేడు సీపీఎం ధర్నా

పెందుర్తి: రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా విశాఖ ప్రజలకు కూటమి నేతలైన ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ద్రోహానికి నిరసనగా సుజాతనగర్‌లో గురువారం ఆందోళన తెలవనున్నట్లు సీపీఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30కు సుజాతనగర్ కూడలి వద్ద నిరసన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలు మణిగాయత్రి, శైలేష్‌లకు బాండ్ అందిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన మణిగాయత్రి, శైలేష్‌కుమార్‌లు బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో ఇచ్చారు. దేవస్థానం తరఫున ప్రొటోకాల్ ఏఈవో రాంబాబు, పర్యవేక్షకుడు విక్రమ్ దాతలకు బాండ్ అందజేశారు. దేవస్థానం తరఫున స్వామి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎరక్షన్ పనుల నిర్వహణ నేపథ్యంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరవాడ, వెన్నెలపాలెం, బొద్దపువానిపాలెం, రావాడ, భర్నికం, స్వయంభూవరం, గొర్లివానిపాలెం, కలపాక, ఈ బోనంగి, పి.ఎస్.బోనంగి, గొల్లలపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదనానరు. విద్యుత్ శాఖ సిబ్బందితో ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెం గ్రామానికి చెందిన కొలిమాల పల్లవి అనే డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైనట్లు తల్లి నాగమణి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. హెచ్‌సీ బి.దేముడు తెలిపిన వివరాలు.. పల్లవి పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 4న కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి, ఇంటి నుంచి బయల్దేరింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమకు తెలిసినవారిళ్లు, బంధువులు, అమ్మాయి స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ దేముడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదం, కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు



కేవీ సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

పెందుర్తి: సంక్రాంతి పండగ సమీపిస్తున్న తరుణంలో కోడిపందాలు, పేకాట, ఇతర జూద ప్రక్రియలపై పూర్తిగా నిషేధం విధిస్తున్నట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. పండగ పేరుతో ఎవరైనా జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతిని ప్రతి ఒక్కరూ వివాదరహితంగా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఉన్న ఊరి నుంచి ఇతర ఊళ్లకు వెళ్లే ప్రజలు తమ సమీపంలోని స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. దొంగతనాల పట్ల ప్రజలు పండగ వేళ మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097

పనిభారం.. బతుకు దుర్భరం!

పారిశుధ్య పనుల్లో 15-20 ఏళ్ల అనుభవం. జీతం మాత్రం రూ.8 వేలుకు అటూఇటుగానే..! ఉదయాన్నే లేచి వీధివీధీ తిరిగి చెత్త సేకరించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. ఇంత చేసినా అరకొర జీతాలే. దాంతో కుటుంబం నెట్టుకురావడం కష్టమే.. అయినా ఏదో ఒక రోజు తమ బతుకులు కూడా మారకపోతాయా.. అన్న ఆశతో నెట్టుకొస్తున్నారు. 40 మంది చేయాల్సిన పనిని 20 మందే చేస్తున్నారు. ఇదీ మేజర్ పంచాయతీ సబ్బవరంలోని పారిశుధ్య కార్మికుల దుస్థితి.



ట్రాక్టర్‌పై తరలిస్తున్న చెత్త

- పని భారంతో అవస్థలు పడుతున్న కార్మికులు
- పరిమిత సిబ్బందితో పారిశుధ్య నిర్వహణ
- పనిలో చేరేందుకు ముందుకు రాని కొత్తవాళ్లు
- కనీస వేతనాలు చెల్లించట్లేదని ఆవేదన



గొటివాడ కాలనీ సమీపంలో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

సబ్బవరం:

మేజర్ పంచాయతీ సబ్బవరంలో పారిశుధ్య నిర్వహణ పడకేసింది. పరిమిత కార్మికులతో పనులు ముందుకు సాగక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. పరిసరాలు అధ్వానంగా మారడంతో ఉన్న కాస్త సిబ్బందికి పనిభారం పెరిగిపోతోంది. ఉన్న కార్మికులకే తక్కువ జీతాలు చెల్లిస్తుండటంతో.. కొత్తవారెవరూ పారిశుధ్య పనికి ముందుకు రావడంలేదు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా.. తమకు వచ్చే అరకొర జీతాలతో కుటుంబ పోషణ భారంగా ఉంటోందని కార్మికులు వాపోతున్నారు.

సగం మందితోనే నెట్టుకొస్తున్నారు

మండల కేంద్రం సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలో సుమారు 20 మంది సిబ్బంది ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణలో ఉన్నారు. వీరిలో ఇద్దరు ట్రాక్టర్ డైవర్లు. మిగిలిన 18 మందితోనే ఎప్పటికప్పుడు చెత్త సేకరణ, తరలింపు పనులు చేపట్టాలి. వీరిలో చాలామంది గత 15–20 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా.. రూ.8 వేలుకు అటూఇటుగానే జీతాలున్నాయి. ఏ రోజుకైనా తమ పరిస్థితులు మారి, జీతాలు పెంచకపోతారా అనే ఆశతోనే పనిలో కొనసాగుతున్నట్లు కార్మికులు చెప్తున్నారు. ఈ పంచాయతీలో వాస్తవంగా సుమారు 40 మంది వరకూ కార్మికులు కావాలి. ప్రస్తుతం నగం మందితోనే నెట్టుకురావాల్సి వస్తోందని గోడు వెల్లబోసుకుంటున్నారు.

4 రోజులు దాటితే జీతంలో కోత

ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణకు రెండు ట్రాక్టర్లు, ఒక టాటా ఏస్ వ్యాన్ ఉన్నాయి. రెండు ట్రాక్టర్లకు ఉన్న సిబ్బంది రెండు రూట్లుగా చెత్తను సేకరించి తరలిస్తున్నారు. టాటా ఏస్‌కు డ్రైవర్ లేకపోవడంతో మూలకు చేరింది. అప్పుడప్పుడూ దీన్ని ప్రత్యామ్నాయ అవసరాలైన విద్యుత్ లైట్లు బిగించుకునేందుకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పారిశుధ్య సిబ్బందికి ప్రతి ఆదివారం సెలవు. వీటితో పాటు నెలకు నాలుగు రోజులు సెలవు మించితే జీతంలో కోత తప్పదు. కోత లేకుండా మొత్తం జీతం అందుకోవడమే చాలా అరుదుగానే జరుగుతుందని కార్మికులు చెప్తున్నారు.



సబ్బవరంలో తరలించకుండా రోడ్డు పక్కనే తగలబెడుతున్న చెత్త

అప్పట్లో రూ.800 జీతం



2005 నుంచి పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నా. అప్పట్లో రూ.800 జీతానికి పనిలో చేరా. ప్రస్తుతం ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. కటింగ్‌లూ పోనూ రూ.10,200 జీతం చెల్లిస్తున్నారు. రోజూ మా ఊరి నుంచి ద్విచక్ర వాహనంపై ఇక్కడికి వస్తుంటా. బైక్ పెట్రోల్‌కే నెలకు రూ.2 వేలు వరకు ఖర్చవుతోంది.

– దొమ్మిసి పెంటారావు, అమృతపురం

17 ఏళ్లుగా ఇదే పని



పదిహేడేళ్లుగా ఇదే పనిలో ఉన్నా. రూ.2 వేలు జీతానికి పనిలోచేరా. ప్రస్తుతం కటింగ్‌లు అన్నీ పోయి చేతికి రూ.9 వేలు వరకూ వస్తోంది. దీంతో కుటుంబాన్ని నెట్టుకురావడం భారంగానే ఉంది. మా స్వగ్రామం మండలంలోని చినయాతపాలెం నుంచి ఇక్కడికి వచ్చేందుకు రోజూ ఆటోకు రూ.40 చార్జీలవుతున్నాయి.

– గెద్దం చిన్నారావు, చినయాతపాలెం

ప్రత్యామ్నాయం లేకే..



నా భర్త సాదు అప్పారావు ఇదే పంచాయతీలో పారిశుధ్య పనులు చేసేవాడు. ఆయన మూడేళ్ల పనిచేసి, అనారోగ్యంతో మరణించాడు. బదులుగా నేను చేరా. 12 ఏళ్లుగా పనిచేస్తున్నా. నెలకు రూ.8 వేలే ఇస్తున్నా, పని భారం ఉన్నా.. ప్రత్యామ్నాయం లేక పనిచేస్తున్నా. బాబు డిప్లొమా చదువుతుండగా, పాప డిగ్రీ పూర్తి చేసింది.

– ఆరిపాక అక్కమ్మ, ఆరిపాక

పరిస్థితులు మారతాయని..



మాది మండలంలోని ఆరిపాక శివారు యాతపాలెం గ్రామం. నాలుగేళ్లుగా సబ్బవరం పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నాను. ప్రస్తుతం కటింగ్‌లు అన్నీ పోనూ రూ.8 వేలు జీతం చెల్లిస్తున్నారు. జీతం తక్కువే ఇస్తున్నా.. ఏదో ఒక రోజు మా పరిస్థితులు మారకపోవు కదా.. అనే నమ్మకంతోనే పని చేస్తున్నాను.

– కలిగొట్ల లక్ష్మి, పారిశుధ్య కార్మికురాలు

■ కలువందం.. కనులందం..



కలువ పూల వంటి కన్నులున్న దానా.. అంటూ అందమైన అమ్మాయిల కళ్లను కవులు కలువ పూలు, కలువ రేకులతో పోల్చడం పరిపాటి. కలువ.. తామర రెండూ అందంలో పోటీ పడేవే..! అయితే తామరతో పోల్చితే కలువది ఓ అడుగు వెనుకే. కలువల్లోనూ తామర పూల మాదిరే తెలుపు, ఎరుపు, నలుపు ఉంటాయి. కలువ సూర్యాస్తమయం తర్వాత చంద్ర కాంతికి వికసిస్తుంది. అందుకే దీన్ని నిశాపుష్పం అంటారు. మేహాద్రి రిజర్వాయర్ దరి చింతగట్ల సమీపంలోని ఓ వ్యవసాయ కాలువలో విరబూసిన కలువ అందాలు ఇలా కనువిందు చేస్తున్నాయి.

- పెందుర్తి

వెంకన్నకు విశేష పూజలు



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



అరచేతిలో పొన్నాకుపై హారతితో భక్తులు

- స్వామివారికి పంచామృతాభిషేకాలు
- రేపు వైకుంఠ ఏకాదశి ఉత్తరద్వార దర్శనం

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. 24వ రోజు బుధవారం విశేష పాశురాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు జరిపారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి చేశారు. తిరుప్పావై 24వ పాశుర విన్నపం చేసి, భావాన్ని వివరించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో వందలాది మంది భక్తులు పాల్గొని కుంకుమ పూజలు జరిపారు. పొన్నాకు అరచేత పట్టి హారతి ఇచ్చారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం వేంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వేకువజాము 4.30 నుంచి స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈవో నీలిమ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తున్నారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, అత్యవసర వైద్య సేవలు అందించనున్నారు. శనివారం కూడారై ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో వెల్లడించారు.

యథేచ్ఛగా గ్రావెల్, మట్టి తవ్వకాలు

- స్థానికులు సమాచారమిచ్చినా పట్టించుకోని వైనం
- అక్రమార్కులతో మైనింగ్, రెవెన్యూ అధికారుల లాలూచీ?



పెదముషిడివాడ తుమ్మల బందలో అక్రమ మట్టి తవ్వకాలు



కొండ బంజరులో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించుకుపోయిన దృశ్యం

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. గ్రామంలో కొండ బంజర్లు, చెరువులు, గెడ్డలు, వాగులు కనిపిస్తే చాలు అక్రమార్కులు రాత్రీ పగలూ తేడా లేకుండా ఇష్టానుసారంగా గ్రావెల్, మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. రెండు చేతులా సొమ్ము చేసుకుంటున్నారు. వారం రోజులుగా గ్రావెల్ దొంగలు మరింతగా రెచ్చిపోతున్నారు.

రాత్రుళ్లు తవ్వకాలు

ఇక్కడ కొండ బంజర్లు, చెరువుల్లో భారీ యంత్రాల సహాయంతో రాత్రి వేళ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్నారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు గ్రావెల్, మట్టి తవ్వి వేరే చోటుకు తరలించుకుపోతున్నారు. గ్రామ సమీపంలో తుమ్మల బంద చెరువులో గత వారం రోజులుగా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. దీనిపై గ్రామస్తులు మైనింగ్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా వారు కనీస చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా తవ్విన గ్రావెల్, మట్టిని లారీలతో గాజువాక, అగనంపూడి, లంకెలపాలెం, ఫార్మాసిటీ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. టిప్పర్, లారీలతో తరలించిన గ్రావెల్‌ను లోడ్ రూ.7– 8 వేలకు విక్రయిస్తున్నారు.

అధికారుల లాలూచీ?

అక్రమార్కులు గత కొంతకాలంగా పలు ప్రాంతాల నుంచి రూ.కోట్ల విలువైన గ్రావెల్, మట్టి తరలించుకుపోతున్నారు. దీనిపై మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులకు పూర్తి సమాచారం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయినా వీరు పట్టించుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులతో అధికారులు చేతులు కలపడం వల్లే అక్రమ గ్రావెల్ దందా యథేచ్ఛగా జరిగిపోతోందని ఆయా ప్రాంతాల ప్రజలు చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా పెదముషిడివాడలో అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

‘అడవివరం’ సొసైటీ డివిడెండ్ల పంపిణీ



సభ్యులకు డివిడెండ్ నగదు, క్యాలెండర్‌ను అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి

సింహాచలం: అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో బుధవారం నుంచి డివిడెండ్ల పంపిణీ ప్రారంభమైంది. సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి చేతుల మీదుగా పలువురు సభ్యులకు డివిడెండ్ నగదుతోపాటు, సొసైటీ రూపొందించిన క్యాలెండర్లు అందించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ సంక్రాంతి కానుకగా షేరుధనంపై 20 శాతం, త్రిఫ్ట్ డిపాజిట్‌పై 8 శాతం వడ్డీని సంఘ సభ్యులకు డివిడెండ్ రూపంలో అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 20 వరకు డివిడెండ్ల పంపిణీ ఉంటుందని, సంఘ సభ్యులంతా సొసైటీ పనివేళల్లో వచ్చి తీసుకోవాల్సిందిగా కోరారు. సొసైటీలో లావాదేవీలన్నీ త్వరలో పూర్తిస్థాయి డిజిటలైజ్ జరుగుతాయని, సంఘ సభ్యులంతా సొసైటీకి ఆధార్‌కార్డుతో వచ్చి కేవైసీని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బుటుబిల్లి మహేష్, పాలకవర్గ సభ్యులు బోర ప్రసాదరెడ్డి, మజ్జి ధర్మరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలు సత్యవతి గృహనిర్బంధం



హౌస్ అరెస్ట్‌లో సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి

సబ్బవరం: విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతిని సబ్బవరం పోలీసులు బుధవారం ఉదయం హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లతో కలిసి ప్రధాని మోదీ విశాఖ రోడ్‌షో, బహిరంగ సభకు వామపక్షాల నిరసన సెగ తగులుతుందనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్కడా అవాంతరాలు, నిరసనలు లేకుండా పోలీస్‌లు ఎక్కడికక్కడ వామపక్ష నాయకుల్ని అరెస్ట్ చేశారు. ఇది ప్రజాస్వామ్య హక్కుల్ని కాలరాయడమేనని వామపక్ష నాయకులు ఆక్షేపించారు.

సబ్బవరం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పడాల రవికుమార్ బుధవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వివరాలను పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఆర్ఎస్ రికార్డులతోపాటు, ఆరోగ్య కేంద్రం రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, చిన్న పిల్లల వివరాలను పరిశీలించి, శతశాతం నమోదు జరగాలని సూచించారు. క్యాన్సర్ సర్వే, ఆర్‌బీఎస్‌కే సర్వే తీరును ఆరా తీశారు. వ్యాక్సిన్లు నిల్వ ఉంచే ఐఎల్ఆర్ డీప్ ఫ్రీజర్ కండిషన్, టెంపరేచర్ చార్ట్‌ను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన బిల్డింగ్‌లోని ల్యాబ్‌ను చూసి, మొత్తం 63 రకాల టెస్ట్‌లను నిర్వహించాలని సిబ్బందిని సూచించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను పరిశీలించి అక్కడి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరతపై వివరాలను అడిగి తెలుసుకుని, సమస్యను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలో డిసెంబర్ నుంచి రెండు రోజుల కిందటి వరకు నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతంగా జరిగాయని తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ తెలిపారు. సదస్సుల్లో వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో విచారణ చేసి సత్వరమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. భూ ఆక్రమణలు, కుటుంబ పంపకాల వివాదాలు, మ్యుటేషన్, ఆన్‌లైన్, ఎఫ్-లైన్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నామన్నారు. సాధ్యమైనంత వేగంగా వివాదాలకు తావులేకుండా అర్జీలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

పెందుర్తి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పెందుర్తి ట్రాఫిక్ విభాగం ఎస్ఐ నరసింహరాజు బుధవారం తనను కలిసిన మీడియాకు తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపితే జరిమానాతో పాటు లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. రెండోసారి కూడా అదే నేరంపై పట్టుబడితే వాహనం సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com